# ఎదురుచూడని మార్పు

అతి సహజంగా తెల్లవారింది. కామాక్షమ్మ మామూలుగా లేచి, పనిలో నిమగ్న అయింది. 'అప్పుడే తెల్లవారిందా?' అని బద్ధకస్తులు కళ్ళునులుముకుంటున్నారు. 'తెల్లవారింది, మనకు కొంత స్వేచ్ఛ' అనుకునే జీవులూ, పదార్థాలూ సంతోషతరంగాలలో వూగుతున్నాయి. ఎవరి పనులు వారు చూచుకో మొదలెట్టారు.

ఆ రోజు కాంతానికి మాత్రం విడ్డూరంగావుంది. అతను మామూలుగా రోజూ తెల్లవారక ముందే లేచి-పనులన్నీ కానిచ్చుకుని ఆఫీసుకు తొందరగా వెళ్ళేవాడు. ఇవాళ ఎనిమిదింటికిగాని లేవలేదు. భర్తతో పాటుగానే లేచి, సవరింపులు చేసుకునే లలితగూడా అందు కనుగుణంగా వేళ మార్చింది. కాంతానికి, ఆ స్థలాన్నీ మనుషుల్నీ, ఆ కాలానికి చూడడం అలవాటు లేనందువల్ల విడ్డూరంగానే వుంది. కామాక్షమ్మ యీ మార్పంతా గమనించినట్లు లేదు. ఇక స్నానానికి ప్రయత్నాలు జరుపుతూన్న ఆవిడకు కాంతం కనిపించాడు. 'ఇదేమిట్రా, ఇవాళ ఇంకా ఇంట్లోనే వున్నావు ఏమిటీ విడ్డూరం?' అందావిడ కొద్దిగా ఆశ్చర్యపడుతోనే. కాంతం చిరునవ్వుతో, సన్నగా యేదో అన్నాడు. కాని ఆ మాటలు అతని పెదిమిలు దాటి-ఓ అంగుళం మేరేనా వచ్చివుండవు. లలితమాత్రం భర్త కెదురుగుండా నిల్చి అత్తగారితో 'వుద్యోగం మారింది. యీ రోజునించీ' అంది. కామాక్షమ్మ ఆనందం ఇనుమడించింది. ఇప్పటికి, కాంతం సందేహపు దొంతరల్లోంచి ఇవతల పడుతూ, 'అవునమ్మా నా వుద్యోగం మారింది. ఆ ఆఫీసులో మారి ఇంకో ఆఫీసులో చేరాను' అన్నాడు. కామాక్షమ్మకు కావాల్సినన్ని ప్రశ్నలు ఎదురు తగిలినై. ఇదివరకు వుద్యోగం కావాలంటే చాలా తిప్పలమీదగాని దొరకలేదే, అంతటి వుద్యోగాన్ని ఎట్లా వదులుకొన్నాడా అనీ; తరువాత ఓ వుద్యోగం మారిపోయిం తర్వాత ఇంత త్వరగామళ్ళీ ఇంకోవుద్యోగం ఎట్లా దొరికిందా

అనీ! ఇవన్నీ అర్థంగాక, "నాకేమీ తెలియటంలేదు. సరిగ్గా విడమర్చి చెప్పరా-" అంది, కొడుకును. కాంతం చెప్పాడు. అయినా ఆవిడకు కొన్ని అనుమానాలు మిగిలేపోయాయి.

"అయితే యీ వుద్యోగంలో జీతం ఎక్కువా?"

"లేదు. వో అయిదు తక్కువే-" అన్నాడు. నెత్తిగోక్కుంటూ, యీ సంగతి ఇంతకన్నా బాగా చెప్పటం ఎట్లానో తెలియక.

"కాకపోతే, ఏమయినా పనితక్కువా?"

"కాక?" అన్నాడు కాంతం విజయ గర్వంతో. "పదింటినుంచీ మూడింటి వరకూ. ఆదివారం సెలవు. సంవత్సరం అంతటికి పాతిక సెలవులు వాడుకోవచ్చు" అని తన వుద్యోగపు షరతులన్నీ చెప్పి ఆవిడను ఉక్కిరిబిక్కిరి చేశాడు.

అంతా విన్నాక, ఆవిడ మళ్ళీ మొదటికొచ్చింది,

"అవుతే, ఆ వుద్యోగం ఎట్లాపోయింది?" వాళ్ళతోనేం పేచీలు గాని..."

"ఎబ్బెబ్బే- ఏమీలేదు. ఆ కంపెనీ దివాలయింది. దాన్లో పనిచేసే వారందరికీ, కొత్తగా పెట్టిన మరో కంపెనీలో మళ్ళీ వుద్యోగాలు చూపించారు. నాకిది దొరికింది. అయిదు రూపాయలు తక్కువయినా, కొద్దిగా విశ్రాంతిగా వుంటుంది గదా అని, వొప్పుకున్నాను" అన్నాడు సర్దిచెప్పే ధోరణిలో.

కామాక్షమ్మకు కొడుకు వుద్యోగం మార్పు విషయం సందేహాలన్నీ తీరినట్టే.

ఈ మార్పుకు కామాక్షమ్మా లలితా గూడా సంతోషించారు.

కొడుకు తమను పోషించటానికి, ఇంత శ్రమ పడుతూ, బొత్తిగా తీరిక లేకుండా వుండటం, ఆవిడకేమీ సబబుగా కనిపించలేదు.

లలిత కాపురానికొచ్చిన యీ మూడేళ్ళలోనూ. భర్తను కనిపెట్టు క్కూర్చొనటానికి నోచుకో లేదు యేవో తప్పనిసరి సెలవలూ, రాత్రిళ్ళూ మినహాయిస్తే.

కాంతం వుద్యోగం మీదనే ఆధారపడి వున్న వాడు గాబట్టే, లలిత ఉచితానుచితాలు ఎరిగినపిల్లే గనకా, సరిపెట్టుక్కూర్చుంది. ప్రపంచంలో సుఖపడేవాళ్ళంతా, ఆ పిల్ల కళ్లముందు కూర్చుంటున్నట్లవుతుంది. ఆ జాబితాలో తనూ చేరబోతోందని అంతకుముందు అనుకున్న లలిత, కాపు రానికి వచ్చింతర్వాత, నీరసించింది. పగలంతా, బల్లమీది కాగితాల కట్టల దొంతరల ముందు కూరుకుపోయి, శ్రమకుదగ్గ పారితోషికాన్ని పొందలేని కాంతాన్ని చూస్తే లలిత గర్వపడాల్సివుంటుంది తనకు జాలివున్నందుకు. ఇలా దైవికంగా మార్పొచ్చి పడుతుందనీ, భర్త తనకు మరీదగ్గరై, సుఖపడ టాన్నిగురించి ఆలోచించటానికి కాలందొరుకుతుందనీ, ఆ యిద్దరిలో ఎవరూ అనుకోలేదు.కాని వొచ్చింది. అందుకు సంతోషించారు.

ఎన్నడూ అర్ధణా, అణా తప్ప డబ్బంటే యేమో యెరగని కుర్ర వాడికి వొక్కసారిగా, రూపాయి యిస్తే ఎట్లా ఖర్చుచెయ్యాలో అర్థంగాక ఠిక మకపడే విధంగా కాంతం బాధపడ్డాడు. రోజుల్లో, పట్టపగలు కొన్నిగంటలు తను యింటగడపాల్సి వచ్చింది ఇప్పుడు. అందుకు మొదట మొదట సంతో షించినా, క్రమేపీ అనుభవంలోనికి వచ్చిన తర్వాత అది కంటకప్రాయమే అయింది. కాకపోతే అతనికి పెళ్లాంతో సరస సల్లాపాలు ఆడటం చేతగాదన టానికి వీల్లేదు, లలితకు కూడా వీలున్నప్పుడల్లా వొచ్చి భర్త దగ్గర కూర్చుని కబుర్లాడాలని వుండేది. కామాక్షమ్మ యేమంటుందోనన్న భయం వుండేది. క్రమంగా దాన్నించీ విడివడి, ముచ్చటలు సాగించేది. అనుకున్న విధంగా కామాక్షమ్మ అడ్డగించలేదు. పైగా ప్రోత్సహించిందేమో. గూడా.

లలిత చెప్పేమాటలు కాంతానికి అర్థం అయ్యేవిగావు కొన్ని కొన్ని. ఆపిల్ల ముఖ్యంగా యిరుగు పొరుగు వాళ్ళ కబుర్లు తప్ప మరేవీ చెప్పేదికాదు.

ఈకబుర్లు విన్నకొద్దీ నిశ్చయంగా కాంతానికి విసుగే ఎక్కువయింది. కాక పోతే యేమిటీ ఆడ సొద?

* * *

కాంతం ఆఫీసు మెట్లు దిగేసరికి మూడు గంటలుదాటి అయిదు నిమిషాలేనా కాలేదు. రోడ్డుమీదికి వచ్చింతర్వాత 'ఎటు పోవాలి?' అన్న చిక్కు ప్రశ్న వచ్చింది. ఇప్పుడింటికి పోయి యేమిటి చెయ్యటం?

ఈ ఆఫీసుతోపని తక్కువచాలా. ఒక్కొక్కరోజు రెండున్నరన్నా కాక ముందే యింటికి వెళ్ళాల్సిన అగత్యం వస్తోంది. ఆలోచిస్తూన్న కాంతానికి, వెనకటిరోజులు గురుతొచ్చాయి. ఆఫీసు కుర్చీనించి లేద్దామంటే, ఎంతకూ వీలు చిక్కేదిగాదు. ఎవరెవరో వచ్చి, ఏవేవో కాగితాలిచ్చిపోయేవారు. ఎన్నో కాగితాలు తన చేతమీదిగా నడిచిపోయేవి. అప్పుడు విసుక్కునే వాడు, ఏమిటీ పనని! 'క్షణం తీరికలేదురా, చస్తున్నా' నని కనబడ్డవాళ్ళతోనల్లా చెప్పేవాడు. ఇపుడు కనిపిస్తూన్న కాలాన్ని సరిగా వినియోగించుకో లేక పోతున్నాడు. సరైన శిక్షణ మనసుకు యివ్వలేక పోతున్నానని బాధ పడు తున్నాడు. పరిస్థితులకనుగుణంగా, మనస్సు మార్చుకోగల నేర్పు అలవరచు కుందామనుకుని ఎన్నోసార్లు ప్రయత్నించీ గూడా విజయం పొందలేక పోయాడు. 'కలిగీ కర్మం, లేక దరిద్రం' అన్న సామెత తనలాటి వాళ్ళకు బాగా అతుకుతుంది. తీరుబాటు కానంతసేపూ కావడంలేదనీ; ఒక్క ఆఫీసు వ్యవహారాలేగాని యితర వ్యాసంగాలు కలిగించుకో వీలుకలగటంలేదనీ; కొద్ది తీరుబడి కలిగినా, ఇతర వ్యాసంగాలు కలిగించుకోవడంలో వెగటూ, ఏవో తెలియని మానసిక బాధా, కొద్ది కాలాన్ని గూడా వినియోగించుకో లేనందుకు, విలాపం!

బ్రతుకుతూన్న తనలాంటి వాళ్ళంతా యేం చేస్తున్నారు తీరిక సమ యాల్లో? కొందరి కసలు చెప్పుకోదగ్గ పనేమీ కనిపించదే, పోనీ అలాంటి వాళ్లతో ఎవరితోనన్నా స్నేహంచేస్తే బాగుణ్ణు, తనకు తీరుబడిగా వున్న

ప్పుడు నెట్టుకురావచ్చు. కాని యిది అసంభవం. సంభవమే అయితే, లలిత చెప్పే కబుర్లు అంత వెగటు కలిగించవు.

నడుస్తోన్న కాంతం కళ్ళకు వో పుస్తకాల షాపు కనిపించింది. అవును! పుస్తకాలు! ఎన్నో పుస్తకాలు! రకరకాలవి దొరుకుతాయ్ యిక్కడ. కాంతానికి తీరని సమస్యగా పరిణమించబోయే యీ విషయాని కొక జవాబు దొరికినట్లయింది. చాలా మెకానికల్‌గా, అతను షాపులో ప్రవేశించాడు. "ఏం కావాలండీ?" అని ఓ పెద్దమనిషి అడిగిన ప్రశ్నకు, ఏం జవాబు ఇవ్వాల్సిందీ తొందరగా తోచక, "యేవేనా పుస్తకాలు" అని బలవంతాన అన్నాడు. ఓ పది పదిహేను పుస్తకాలు ముందుకు వచ్చాయి. వాటిలో రెండు యేరుకుని బిల్లు చెల్లించి ఇవతలపడ్డాడు. వాటిని చూసుకుంటూ యిల్లు చేరేసరికి నాలుగయింది. కాంతం సరాసరి ఖాళీగా వున్న యీజీ చైర్‌లో కూర్చుని "చదవటం" ప్రారంభించాడు. లలిత అతనికి కాఫీ తెచ్చిచ్చి, అతను తాగుతోన్నంత సేపట్లో యీ రెండు పుస్తకాలూ చూసింది, వాటి పేర్లూ అదీ. "ఎక్కడివండీ?" కొన్నానన్నాడు. అనవసరమైన ఖర్చని లలిత అంటుందేమోనని భయపడుతోనే. "కొన్నారా?..." అని ఆగిపోయింది.

"ఏం?"

"ఏమీలేదు. కావాలంటే నేను తెచ్చి ఇచ్చేదాన్ని గదా, ఇట్లాంటివి అని–"

"ఎక్కణ్ణించీ?"

"పక్కింటమ్మాయ్ నిర్మల కిల్లాంటి పుస్తకాలు చదవటం చాలా సరదా. ఆవిడ దగ్గిర యెన్నో వున్నాయి.

"అట్లానా? నువ్వూ చదివావా?"

"కొన్ని చదివాను. ఇదిగో, వీటిలో ఒకటి చదివాను ఇదివరకు" అంది.

"ఆహా" ఆశ్చర్యాన్నే నటించాడు కొంత!

*  *  *

కాంతం లలితా భోజనాలు చేశాకగాని ఎనిమిదిగంట లవలేదు. లలిత చీల్చి యిస్తున్న తమలపాకులు నముల్తూ కాంతం, అప్పుడే రంగంలో ప్రవేశించిన చంద్రుణ్ణి చూచి వూహా ప్రపంచంలోంచి, భయపడి ఇవతల పడ్డాడు. అతనింతవరకూ ఆలోచిస్తోన్నది లలితని గూర్చి. ఈ పుస్తకాల్లో కావల్సినంత అవినీతి, మనుషుల్ని చెడగొట్టే దురభిప్రాయాలు వ్రాసివున్నై. ఎంతో తెలివితేటలు వుంటేగాని వాటిబారినుంచీ తప్పించుకొనటం కష్టం. బుద్ధికుశలతా నిగ్రహశక్తీ చాలా కావాలి! ఎవరు చెప్పగలరు? "బుద్ధిః కర్మానుసారిణీ" కాదూ? తన ఆలోచనలు చంద్రుడికి తెలిశాయేమోనని భయపడ్డాడు.

"ఏమిటండీ ఆలోచిస్తున్నారు?-"

"ఏమీలేదు-"

"చెబుదురూ-"

"కొత్త సినిమాలు..." సినిమా! తప్పకుండాను.

పుస్తకాలంటే కాంతానికి విసుగే పుట్టింది. చాలాకాలంగా అలవాటు పడ్డ పని మానేసి, అంత అభిరుచిలేని మరొకటి చేయటం కష్టమే మరి!

"అమ్మా- సినిమాకు వెడదామా?" అన్నాడు కాంతం.

కామాక్షమ్మ ఆశ్చర్యపడ్డది. "నేను సినిమా కేమిట్రా? మీరిద్దరూ వెళ్ళిరండి. ఇంటో వుంటా నేను."

"ఇంట్లో ఎవరూ వుండక్కర్లేదులే. భయంలేదు. సినిమా బాగుం దట, రా."

ఈసారీ ఆవిడ ఇష్టపడలేదు. కాంతం మరి బలవంతం చెయ్యలేదు. లలిత, కాంతం, సినిమానించి వచ్చేసరికి వొంటిగంటయింది. ఇద్దరికీ

పుట్టుసబ్బులుగా వుండి నిద్దరోయారు. అయినా మర్నాడు, పొద్దున్నే తొందరగా లేచారు ఇద్దరూను.

కామాక్షమ్మ లేచింతర్వాత, కాంతం కనిపించకపోయేసరికి, అదేమని కోడలి నడిగింది.

లలిత తలొంచుకుని, "మళ్లీ మామూలు వుద్యోగమే ఆయింది" అంది.

"అదేం?" అదరిపడ్డది కామాక్షమ్మ.

"ఆ కంపెనీ మళ్లీ తలెత్తిందిట!"

కామాక్షమ్మ మరేమీ మాట్లాడలేదు.

కాంతం మళ్లీ మామూలు మనిషయ్యాడు. అతని ఆలోచనలు అంతరించినై. మధ్యలో యీ అర్థంలేని మార్పు ఎందుకు వచ్చిందో లలితకూ, కాంతానికీ గూడా అర్థంగాలేదు. ●

(తెలుగు స్వతంత్ర)